క్లుప్తంగా

నిరుపేదలకు రంజాన్ తోఫా

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మోచంపేటలో లైఫ్‌లైన్ ఆస్పత్రి అధినేత డాక్టర్ షేక్ రబ్బాని ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకుల కిట్‌ను రంజాన్ తోఫాగా అందజేశారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి అతిథిగా హాజరై 300 కుటుంబాలకు రంజాన్ సందర్భంగా నిత్యావసర సరుకుల కిట్లను అందజేసి మాట్లాడారు. కార్యక్రమాన్ని నిర్వహించినందుకు వైద్యుడు రబ్బానీని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాలు పంపిణీ

కడప కార్పొరేషన్: పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని 30వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షఫీ మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే తన డివిజన్‌లో పనిచేస్తున్న కార్మికులందరికీ నూతన వస్త్రాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు అహ్మద్, సచివాలయ కన్వీనర్ వసీం, ఫైరోజ్ పాల్గొన్నారు.

‘ఫాతిమా’లో ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నగర ముస్లిం ప్రముఖులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర పరిధిలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో శుక్రవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కళాశాల చైర్మన్ ఏక్యూ జావేద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నగర ప్రముఖులు, వైద్య విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ ఏర్పాటు చేయడం అత్యంత పుణ్యదాయకమన్నారు. అనంతరం ముస్లిం సోదరులు ఇఫ్తార్ స్వీకరించి ఉపవాస దీక్ష విరమించారు. అనంతరం సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీహెచ్ అధినేత నవీద్, మాజీమంత్రి అహ్మదుల్లా, నగర ప్రముఖులు అమీర్‌బాబు, సయ్యద్ సలావుద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్ గిరిధర్, వైస్ ప్రిన్సిపాల్ రామమనోహర్‌రెడ్డి, చైర్మన్ పీఏ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ రాక

కమలాపురం : స్థానిక పాత బస్టాండులో నూతనంగా నిర్మించే ఆర్టీసీ బస్టాండుకు భూమి పూజ కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి హాజరు కానున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన తెలిపారు.

12వ పీఆర్‌సీ కమిటీ వేయాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయాల్సిన పన్నెండవ పీఆర్‌సీ గడువు సమీపిస్తున్నందున వెంటనే కమిటీ వేయాలని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు రమణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కడపలోని ఎస్టీయూభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చే జీవభత్యాలపై సమీక్షించి తదనుగుణంగా ఐదు సంవత్సరాలకు ఒకసారి పీఆర్‌సీ అమలు చేయడం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. జూన్ 2023తో పదకొండవ పీఆర్‌సీ కాల పరిమితి ముగుస్తున్నందున వెంటనే పన్నెండవ పీఆర్‌సీ కమిటీ వేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్‌బాషా మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ ఎస్టీయూ నాయకులు సురేష్‌బాబు, శంకరయ్య, హైదర్‌వల్లి, ఖాదర్‌బాషా, రెడ్డెన్న, సాంబశివారెడ్డి, రామోహన్ పాల్గొన్నారు.

బీజేపీని ఇంటికి సాగనంపుదాం



ప్రచార భేరిలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు పేర్కొన్నారు. శుక్రవారం మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార భేరీని నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో దళితులకు, మైనార్టీలకు రక్షణ కరువైందన్నారు. ఈ నేపథ్యంలో దేశాన్ని కాపాడుకోవడానికి.. లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్, నాయకులు వెంకట శివ, కృష్ణమూర్తి, బషీరున్నీషా, కేసీ బాదుల్లా, సావంత్ సుధాకర్, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్

చీకటి నిండిన బహుజనుల జీవితాలకు
ఆయనో దీప ధారి..
అసమానతలను రూపుమాపేందుకు
నిత్యం అక్షర సేద్యం సాగించిన హలధారి..

తరతరాల ‘చరిత్ర’ను చీల్చి..
కొత్త అధ్యాయం లిఖించిన వెలుగు సూరీడు..
బానిసత్వ సంకెళ్లను తెంచి
వెన్నెల పంచిన నిండు చందురుడు...

భారత రాజ్యాంగానికి ఆయనే ఆత్మ..
నిండైన జ్ఞానానికి నిలువెత్తు దర్పణం
ఆయన ప్రతిమ..

దశాబ్దాలు కాదు.. శతాబ్దాలు గడిచినా
ఆయన పేరు నినాదమై మార్మోగుతోంది..
ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది ..

అదే జై భీమ్..





జై భీమ్ ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగ, విద్యార్థి సంఘాల నేతలు

మహోన్నతుడు బీఆర్ అంబేడ్కర్

● ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: భారత దేశానికి ప్రపంచంలోనే అతిపెద్దదైన లిఖిత రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహోన్నతుడని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా కొనియాడారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆర్టీసీ బస్టాండు కూడలిలోని ఆయన విగ్రహానికి మేయర్ సురేష్ బాబుతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, డీఎల్‌డీఏ చైర్మెన్ మాధవరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యావత్ ప్రపంచానికి ఆదర్శనీయం

కడప సిటీ : నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని డీఆర్వో గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్ అధ్యక్షతన అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి జిల్లా అధికారులు , పలు దళిత, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైవీయూ/సెవెన్ రోడ్స్/వైఎస్సార్ సర్కిల్: జ్ఞానానికి ప్రతీక అంబేడ్కర్ అని వైవీయూ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. వైవీయూ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

● జిల్లా పరిషత్ ముఖ్య కార్యానిర్వహణ అధికారి శుక్రవారం తన చాంబర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

● అంబేడ్కర్ విగ్రహానికి యూత్ కాంగ్రెస్, డీజీహెచ్‌పీఎస్, సీపీఐ నాయకులు నివాళి అర్పించారు. ఆర్‌సీపీ నాయ కులు పానకం పంపిణీ చేశారు.

● రిమ్స్‌లో, జిల్లా కోర్టు ఆవరణలో, కడప కేంద్రకారాగారంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి.



అంబేడ్కర్ సర్కిల్‌లో అన్నదానం చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



కార్పొరేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్



కడప విమానాశ్రయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు



కేంద్రకారాగారంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సూపరింటెండెంట్ ప్రకాష్, అధికారులు



వైవీయూలో నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్



జిల్లా గ్రంథాలయంలో అంబేడ్కర్‌కు నివాళి



రిమ్స్ ఐపీ విభాగంలో రోగులకు పండ్లు పంపిణీ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప రూరల్: ఏపీ ఎస్సీ, ఎస్టీ, గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోషియేషన్, ఏపీ షెడ్యూల్డ్ క్యాస్ట్ , ఇతర బహుజన ఎంప్లాయిస్ మరియు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కోటిరెడ్డి సర్కిల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు పెద్ద ఎత్తున ‘జై భీమ్ వాక్ ర్యాలీ’ని నిర్వహించారు. భారత రాజ్యాంగం వర్ధిల్లాలి అనే నినాదంతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేవీ రమణ, జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

● ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్మూర్తి , అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్యనిర్వాహక కార్యదర్శి బాల సుబ్బయ్య పర్యవేక్షణల మహాజన రాజ్యం పార్టీ ఆధ్వర్యంలో, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి.

కడప కోటిరెడ్డిసర్కిల్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దార్శనికుడని ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్‌రెడ్డి తెలిపారు.

● కడప రైల్వేస్టేషన్‌లో, కడప విమానాశ్రయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

● ఎస్‌సీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్పీ కేకేఎన్‌అన్బురాజన్ చేతుల మీదుగా డైరీని ఆవిష్కరించారు.

కడప కల్చరల్ : కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ప్రధాన కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ఆకాశవాణి కడప కేంద్రం ప్రధాన కార్యాలయంలో, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లోగల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కడప కార్పొరేషన్: కడపలోని ట్రాన్స్‌కో నిలయంలో చీఫ్ ఇంజనీర్ పి. మోహన్‌రావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీకే వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

● రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో, పాత మున్సిపల్ కార్యాలయంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో , ఇంటర్నేషనల్ దళిత్ జర్నలిస్ట్స్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నగరంలో జోరుగా ‘జగనన్నే మా భవిష్యత్’



12వ డివిజన్‌లో పీపుల్స్ సర్వే నిర్వహిస్తున్న కార్పొరేటర్ శివకోటిరెడ్డి, గృహసారథులు



25వ డివిజన్‌లో ‘జగనన్నే మా భవిష్యత్’ కార్యక్రమం నిర్వహిస్తున్న జయచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని పలు వార్డుల్లో ‘జగనన్నే మా భవిష్యత్’ జోరుగా సాగుతోంది. కడప నగరంలోని 12వ డివిజన్ పరిధిలోని ఫక్కీరుపల్లె, చిన్నచౌకు ప్రాంతాల్లో కార్పొరేటర్ సానపురెడ్డి శివకోటిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రభుత్వం 600 ఉచిత హామీలిచ్చి మోసం చేసిన వైనాన్ని, ప్రస్తుత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ తు.చ తప్పకుండా అమలు చేస్తున్న విధానాన్ని వివరించారు. వారి ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. వారి మొబైల్ నుంచి మిస్డ్‌కాల్ ఇప్పించారు. కాంట్రాక్టర్ కె. సుధాకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

20వ డివిజన్‌లో.... కడప నగరంలోని 20 డివిజన్ మారుతీనగర్, ఏపీహెచ్‌బీ కాలనీలో కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ‘జగనన్నే మా భవిష్యత్’ కార్యక్రమం నిర్వహించారు.

25వ డివిజన్‌లో.... కడప నగరం 25వ డివిజన్‌లోని బాలాజీపేటలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ‘జగనన్నే మా భవిష్యత్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారితో పదిహేను నిముషాలు మాట్లాడి గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తున్న తీరును తెలుసుకున్నారు. స్టిక్కర్లు అతికించి, మిస్డ్‌కాల్ ఇప్పించారు.

విద్యార్థులకు వెలుగునిచ్చిన కేఎస్ఆర్ఎం

– ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి



మాట్లాడుతున్న ఏపీ శాప్ చైర్మన్ సిద్దార్థరెడ్డి

కడప ఎడ్యుకేషన్: కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఎంతోమందికి పేద విద్యార్థులకు విద్యతోపాటు ఉపాధిని అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిందని ఆంధ్రప్రదేశ్ శాప్ చైర్మెన్, యూత్ వింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పేర్కొన్నారు. కేఎస్ఆర్ఎం కళాశాలలో నిర్వహించిన కేఎస్ఎస్ఆర్ ట్రోఫీ 2కే 23 ఘనంగా ముగిసింది. ఈ ట్రోఫీలో పురుషుల విభాగంలో రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి బాస్కెట్‌బాల్ పోటీలకు 13 టీములు, వాలీబాల్‌కు 18, కబాడీ 11, క్రికెట్ 23 టీములు, మహిళల విభాగం నుంచి వాలీబాల్ 5, హ్యాండ్‌బాల్ 13, కబడ్డీ 11, త్రోబాల్ 14, చెస్ 8, టెన్నికాయిట్ 15 టీములు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో వివిధ క్రీడల్లో ప్రతిభచాటిని విజేతలకు బైరెడ్డి సిద్దార్థరెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలల్లో క్రీడల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, కేఎస్ఆర్ఎం ప్రధానాచార్యులు వీఎస్ఎస్ మూర్తి, కేఎల్ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రధానాచార్యులు రత్నమ్మ, ఎఎం ప్రేమ్‌కుమార్, పీడీలు నారాయణ, వంశీనాయక్, గంగాదేవి పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ నాగరాజు, ఇతర వైద్య సిబ్బంది

కడప రూరల్ : వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి...ఆరోగ్య సంరక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య మేళా ఐదవ వార్షికోత్సవ సందర్భంగా కడప నగరంలోని రవీంద్రనగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అందరికీ ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులు, హై రిస్క్ గర్భిణులు, కలుషితమైన నీటి వల్ల, దోమల వల్ల వచ్చే వ్యాధులు, వడదెబ్బ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ మల్లీశ్వరి, డాక్టర్ శౌభిభూషణ్, వెంకట చంద్రారెడ్డి, సూపర్‌వైజర్ మహబూబ్ బాష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తున్నది ఏపీ ప్రభుత్వమే

కమలాపురం : దార్శనికుడు, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నది ఏపీ ప్రభుత్వం ఒక్కటేనని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని స్థానిక క్రాస్ రోడ్డు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నవ్యాంధ్ర మాల మహానాడు రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు కొత్రపాటి శరత్‌బాబు, సుధీర్‌ల ఆధ్వర్యంలో సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజుల రెడ్డితో కలసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అంబేడ్కర్ అభిమానులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు ప్రస్తుతం ఈ స్థాయిలో ఉన్నారంటే అది అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం, చేపట్టిన సంస్కరణల చలువేనన్నారు. దేశంలో ఏపీ ప్రభుత్వం మాత్రమే అంబేడ్కర్ ఆశయాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి చుట్టూ ఆహ్లాదకరమైన పార్కును ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజుల రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ జీవించింది 65 ఏళ్లేనని, అయితే ఆయన మరణించి 67 ఏళ్లు అవుతున్నా ప్రతి ఏటా ఆయన జయంతి వేడుకలు నిర్వహించుకోవడం హర్షణీయం అన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ స్టేట్ చైర్మన్ పులి సునీల్‌కుమార్, స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం ఆదర్శప్రాయం

వైవీయూ : అంబేడ్కర్ జీవితం ఆదర్శప్రాయమని జిల్లా విద్యాశాఖాధికారి యెద్దుల రాఘవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో డా. బి.ఆర్. అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్‌పై విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ గొప్పదనం గురించి వివరించారు.

జాగ్రత్తలు పాటించి అగ్ని ప్రమాదాలను నివారించాలి

కమలాపురం : చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని కమలాపురం సబ్‌జైలు సూపరింటెండెంట్ గంగాధర్ తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఫైర్‌స్టేషన్‌లో ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆయన అగ్ని ప్రమాదాల నివారణ కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు జరిగితే 101కు కాల్ చేస్తే అగ్నిమాపక సిబ్బంది అక్కడి చేరుకుని ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారిస్తారని ఆయన అన్నారు. ఎస్ఎఫ్ఓ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న ముంబయిలోని విక్టోరియా నౌకలో జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు 200 మంది అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఫైటింగ్ చేస్తూ సజీవదహనం అయ్యారన్నారు. ఈ సంఘటనను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్ని మాపక వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. అనంతరం అగ్ని మాపక పరికరాల ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు, అగ్ని మాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

శిల్పారామంలో మార్పులకు శ్రీకారం

● వేగంగా జరుగుతున్న పనులు
● పనులను పరిశీలించిన శిల్పారామాల సీఈఓ

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో మార్పులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాష్ట్ర శిల్పారామాల సీఈఓ శ్యామ్‌సుందర్‌రెడ్డి శిల్పారామాన్ని సందర్శించారు. మార్పుల్లో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిల్పారామంలో కనుచూపుమేర పచ్చిక బయళ్లు పెంచి ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు కొన్ని మార్పులు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతమున్న గేమింగ్ జోన్‌లోని పలు స్టాల్స్‌ను శిల్పారామం దుకాణాల సముదాయం చివరకు మారుస్తున్నామని, అందులో భాగంగా ఎలక్ట్రికల్ వైరింగ్ పనులు చేపట్టామని, అండర్ గ్రౌండ్ పద్ధతిలో వైరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. శిల్పారామంలోకి ప్రవేశించగానే పచ్చిక కనిపించి ఆహ్లాదం గొలిపేలా ఉండేలా చర్యలు చేపట్టామని వివరించారు. భద్రతకు ప్రాధాన్యతను ఇస్తూ శిల్పారామాన్ని అణువణువు ఆహ్లాదం, ఆనందం పంచేలా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని ఆయన వివరించారు. ప్రస్తుతం విద్యుత్ వైర్ల పనులు జరుగుతున్నాయని, రంజాన్ పండుగ అనంతరం పనుల్లో వేగం పెంచి వీలైనంత త్వరలో కొత్తగా కనిపించే శిల్పారామాన్ని సందర్శకులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృసి చేస్తున్నామన్నారు. హస్తకళల కళాకారులు తాము రూపొందించిన వస్తువులను శిల్పారామాలలో విక్రయించేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. తాము తయారు చేసిన వస్తువులను విక్రయించేలా స్టాల్స్‌ను ఉచితంగానే ఇస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కరువు భత్యం విడుదల చేయాలి

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ రిటైర్డ్ ఉద్యోగులకు 2018 నుంచి ఇప్పటి వరకూ నాలుగు విడతల కరువు భత్యం, అరియర్స్ వెంటనే విడుదల చేయాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు జంబారపు అహరోను, జిల్లా కార్యదర్శి సి. గంగన్న, కోశాధికారి సి. నరేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులు కేపీ సుహాసిని, పి. బాలచౌడన్న సంయుక్తంగా కోరారు. శుక్రవారం గుంతబజారులోని అసోషియేషన్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. 2018 నుండి ఎంతో మంది రిటైరై పెన్షన్ పొందుతున్న ఉద్యోగులు ఈ బకాయిల సొమ్ము పొందక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెండ్లిమర్రి: మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామ సచివాలయం పరిధిలోని మొయిళ్లకాల్వ, ఎస్.రామాపురం, అయ్యవారుపల్లె గ్రామాలల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి హాజరవుతారన్నారు.